క్లుప్తంగా

తక్షణసాయం అందజేత



బాధితులకు నగదు అందజేస్తున్న దృశ్యం

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): మండలంలోని గొడిశలపల్లికి చెందిన మంగలి భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ రాళ్ల తిమ్మారెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అనంతరం వైఎస్సార్ భీమా పథకం కింద తక్షణ సాయం రూ. 10 వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. మిగలిన మొత్తం బాధితుల బ్యాంకు ఖాతాలోకి జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ బండి రామకృష్ణ, నాయకులు బోయ వన్నూరుస్వామి గౌస్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



రహదారి పక్కన హోర్డింగ్‌లు ఏర్పాటు చేయించిన ఎస్‌ఐ సత్యనారాయణ

కూడేరు: మత్తు పదార్థాలకు బానిసై బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని లెప్రసీ కాలనీ నుంచి బ్రాహ్మణపల్లి వరకూ అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు డ్రగ్స్‌కు బానిస కావద్దని తద్వారా కలిగే అనార్థాలను తెలియజేసే హోర్డింగ్‌లను ఏర్పాటు చేయించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వాడడం అంటే చావుకు దగ్గరైనట్టేనని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల అపహరణ

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో గొర్రెలు అపహరణకు గురయ్యాయి. బాధితుడు కృష్ణ తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు 4 గొర్రెలను దొంగలించారన్నారు. దాదాపు రూ. 75 వేలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

లేగదూడకు పంచనామా

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కామక్కపల్లి సమీపంలోని తోటల్లో లేగదూడపై చిరుత దాడి చేయడంతో దూడ చనిపోయిన సంగతి తెలిసిందే. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామేశ్వరి, వెటర్నరీ శాఖ గోపాలమిత్ర వెంకటేశులు, గ్రామస్తుల సమక్షంలో ఆదివారం పంచనామా నిర్వహించారు. రైతు రామాంజనేయులతో సంఘటనకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నారు.

వైభవంగా మహా చండీహోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులోని జగదీశ్వరీ అమ్మవారి ఆలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా ఆదివారం మహా చండీహోమం వైభవంగా నిర్వహించారు. ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

అక్రమ నియామకాలపై విచారణ చేయించండి

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని కన్నడ మాధ్యమ పాఠశాలల్లో బోగస్ సర్టిఫికెట్లతో కొందరు ఉపాధ్యాయులు విధుల్లో చేరారని, అలాంటి నియామకాలపై నిజనిర్ధారణ కమిటీతో సమగ్ర విచారణ జరిపించి, స్థానిక నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఎంపీపీ ఎం.పవిత్ర ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం. వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, పార్టీ నాయకులు రహంతుల్లా, సింగాడి జగదీష్ ఆదివారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ మంత్రితో పాటు విద్య కమిషనర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లి సర్టిఫికెట్లను పునఃపరిశీలన జరిపేలా కృషి చేస్తానని విప్ హామీ ఇచ్చారు.

నివాళి

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న మాతృమూర్తి భీమక్కకు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కె.మారెంపల్లిలో ఆదివారం భీమక్క వైకుంఠ సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన విప్ తదితరులు భీమక్క చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం

- గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లే కీలకం
- మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను చూపుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



డి.హీరేహాళ్: మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం: 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవడానికి మనమందరం అండగా నిలుద్దామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం శెట్టూరు మండల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, ముఖ్య నాయకులతో 'మా నమ్మకం... నువ్వే జగన్' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని పేదలకు అందించడమే గృహ సారథులు, కన్వీనర్ల లక్ష్యమన్నారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా నియమించిన గృహసారథులు వారికి కేటాయించిన ఇళ్లలోని లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ద్వారా జరిగిన లబ్ధిని వివరించాలన్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేలను తిట్టడమే లోకేష్ పని

లోకేష్ తన పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల చేయి కూడా తాకలేడని స్పష్టం చేశారు. తనపై ఎవరు ఎక్కువ బురద జల్లితే వారికే టికెట్ ఇస్తారన్న ధోరణితో టీడీపీ నాయకులు ఉమామహేశ్వర నాయుడు, మారుతీ చౌదరి, ఉదయ్ చౌదరి పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. తనపై ఆధారాల్లేని ఎన్ని ఆరోపణలు చేసినా భయపడేది లేదని తేల్చిచెప్పారు. తాన ఇసుక అమ్ముకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. టీడీపీకి అధికారం ఇస్తే సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి పథకాలే లేకుండా చేస్తారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న బీసీ కులానికి చెందిన మంత్రి ఉషశ్రీచరణ్‌పై టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. బీసీ నాయకులు ఎదిగితే పచ్చ పార్టీ నేతలు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. అనంతరం 'మా నమ్మకం...నువ్వే జగన్' స్టిక్కర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శెట్టూరు మండల సచివాయాల కన్వీనర్ పెరుగు తిమ్మరాజు, జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నాయకులు రాంభీమప్ప, ముత్యాలు, బొమ్మజ్జి రమేష్, రామకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ గొర్ల గంగాధర, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, టీడీపీ నేతల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. డీహీరేహాళ్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ, కాదలూరు గ్రామంలో ఆదివారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లల సమావేశం నిర్వహించారు. విప్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో మూడున్నరేళ్లలో రూ.1.90 వేల కోట్లను మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేశారన్నారు. ఒక్క రూపాయి కూడా అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులకే పథకాలను వర్తింపజేశారన్నారు. ప్రజలందరూ జగనన్న పాలనపై సంతృప్తిగా ఉన్నారని, 2024లోనూ వైఎస్సార్‌సీపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. కన్వీనర్లు, గృహసారథులు తమకు కేటాయించిన పరిధిలో ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న 'నా నమ్మకం నువ్వే జగన్' సామగ్రిని అందించి, సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. సర్వే పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్లి వారికి సమ్మతంగా ఉంటేనే జగనన్న స్టిక్కర్ అంటించాలని, స్మార్ట్‌ఫోన్ ఉన్న వారికి స్టిక్కర్ ఇవ్వాలన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కన్వీనర్లు, గృహసారథులులకు నా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భోజరాజునాయక్, ఎంపీపీ పవిత్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి, జేసీఎస్ కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచ్‌లు మల్లికార్జున, లీలావతి, లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, పార్వతి, రుద్రేష్, బొమ్మన్న, వైస్ ఎంపీపీ లింగప్ప, ఎంపీటీసీలు శివలింగప్ప, తిప్పేస్వామి, అనిత, ఎర్రిస్వామి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నను ఆశీర్వదించండి



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: సంక్షేమ సారథి సీఎం జగనన్నను ఆశీర్వదించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ కోరారు. మండలంలోని ముద్దినాయనపల్లి పంచాయితీ పరిధిలోని మౌక్తికాపురంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, పింఛన్, విద్యాదీవెన, గ్రామానికే వైద్యసేవలు లాంటి పాలన గతంలో ఉండేదా అని ఆరా తీశారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. అణగారిన వర్గాల ప్రజలకు ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు చంద్రానాయక్, సీతమ్మ, శేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, ఎంపీటీసీ పక్కీరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు నగేష్‌నాయక్, శివలింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, బాబు, డీలర్ వెంకటరమణ, వెంకటరామ్‌నాయక్, శ్రీనివాసులు, ఓబుళపతి, హనుమంతరాయుడు, లోకేష్‌రెడ్డి, వన్న కేశవ, అజిత్, సచివాలయ కన్వీనర్లు, అధికారులు పాల్గొన్నారు.

అంధత్వాన్ని నివారించడమే ఆశయం



బాధితులకు సూచనలిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: అంధత్వ లోపంతో బాధపడుతున్న నిరుపేదలకు కంటిచూపు కల్పించడమే ఆశయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి కల్యాణమంటపంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ శంకర కంటి ఆస్పత్రి వైద్యులు బాధితులను పరీక్షించారు. శస్త్ర చికిత్స కోసం 70 మంది ఎంపికయ్యారు. విప్ మాట్లాడుతూ శస్త్ర చికిత్స సమయంలో వైద్యుల సలహాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, మండల కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆంజనేయస్వామి రథోత్సవం



మలయనూరులో భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం

కుందుర్పి: మండలంలోని మలయనూరు, అప్పిలేపల్లి గ్రామాల్లో ఆదివారం ఆంజనేయస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆయా గ్రామాల్లో ఉదయం హోమాలు, మధ్యాహ్నం మడుగు రథోత్సవాలు చేపట్టారు. మలయనూరులో సాయంత్రం ఐదు గంటలకు రథోత్సవం నిర్వహించగా అప్పిలేపల్లిలో ఆదివారం రాత్రి 12 గంటలకు బొబ్బర్లకుంట ఆంజనేయస్వామి రథోత్సవం చేపట్టారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.ఆయా గ్రామస్తులే గాక కర్ణాటక నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాలకు హాజరయ్యారు. రూరల్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కృష్ణమూర్తి బందోబస్తు పర్యవేక్షించారు.

రంగనాథుడి తిరుకల్యాణోత్సవం

బెళుగుప్ప: మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో ఆదివారం రంగనాథస్వామి తిరుకల్యాణోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామికి భక్తజన సందోహం మధ్య ప్రధాన అర్చకుడు గరుడాద్రి శంకర శర్మ, వేదపండితుల మంత్రోచ్ఛారణలతో కల్యాణోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుని ఉత్సవ విగ్రహాలతో కూడిన ప్రభోత్సవం నిర్వహించారు. సర్పంచ్ సాహితీరెడ్డి, మారుతీరెడ్డి, గ్రామపెద్దలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



రంగనాథస్వామి కల్యాణోత్సవ దృశ్యం

వైభవంగా నరసింహస్వామి బ్రహ్మరథోత్సవం



అశేష భక్త జనసందోహం మధ్య లక్ష్మీనవనారసింహ బ్రహ్మరథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం పంచాయతీ పరిధి విప్రమలై కొండల్లో వెలసిన లక్ష్మీ నవనారసింహస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయకమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తీ స్వామీజీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యకైంకర్యములు గావించి రథాంగహోమం చేపట్టారు. 9.15 గంటలకు మడుగుతేరు నిర్వహించారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోవిందనామస్మరణతో అశేష భక్తజనసందోహం మధ్య బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున, ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ తిప్పేస్వామి, ధర్మన్నతో కలిసి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి రథాన్ని లాగి ప్రారంభించారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళు శిల్ప, రాజేంద్రరెడ్డి, పాటిల్ సదాశివారెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉత్సవానికి రాయదుర్గం పరిసర ప్రాంతాల నుండే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు అశేషంగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూరల్ సీఐ యుగంధర్, ఎస్‌ఐలు సుమన్, సునీత, దుగ్గిరెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, పురప్రముఖులు, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. పట్టాభిరాముని రథోత్సవం



రథోత్సవ దృశ్యం



పట్టాభిరాముని దర్శించుకుంటున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: పట్టణంలోని కోటవీధిలో పట్టాభిరామస్వామి రథోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. ఉదయం స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. మధ్యాహ్నం స్వామి మడుగు తేరును ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. సాయంత్రం ప్రధాన రథాన్ని లాగుతూ స్వామిని స్మరించుకున్నారు. రథోత్సవం సందర్భంగా స్థానిక కోటవీధిలోని రామాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు భారీ జనసందోహం కనిపించింది. రథంపై భక్తులు అరటిపండ్లు, బెల్లం విసురుతూ మొక్కులు తీర్చుకున్నారు. సీఐ తేజమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. అంతకు ముందు పట్టాభిరాముడిని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కౌన్సిలర్లు మహాలక్ష్మి, లక్ష్మన్న, ఎండోమెంట్ ఈఓ ఈశ్వర్‌రెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, సుబ్బరాయుడు, వెంకటేష్, గోళ్ల మోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు, పెరుగు తిమ్మరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు హనుమంతరాయుడు సోదరుడు, పార్టీ కార్యకర్త బొమ్మయ్య(43) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ మృతుడి సోదరుడితో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టైలర్స్ యూనియన్ నేతలు

ఉరవకొండ: టైలర్ వృత్తిపై ఆధారపడి పనిచేస్తున్న వారికి జగనన్న తోడు ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఉరవకొండ టైలర్స్ యూనియన్ నాయకులు అన్నారు. ఆదివారం జగనన్న తోడు ద్వారా వరుసగా మూడో ఏడాది కూడా నగదు జమ చేసినందుకు పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ నినాదాలు చేశారు. టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు జంగ్లీ నగేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి టైలర్స్ యూనియన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శిలార్ మగ్బూల్, వెంకటరమణ, మహేష్, లాలు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

వాల్మీకుల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేద్దాం



ఎన్నికైన వాల్మీకి సేవా సమితి నూతన కార్యవర్గ సభ్యులు

కళ్యాణదుర్గం: వాల్మీకుల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేద్దామని నియోజకవర్గ నూతన అధ్యక్షుడు ములకనూరు గోవిందు పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఆదివారం నియోజకవర్గ స్థాయి వాల్మీకుల ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి వాల్మీకి సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పెద్ద ఓబిలేశు, అధ్యక్షుడిగా ములకనూరు గోవిందు, సభ్యులుగా మధు, బీటీ రాము, వెంకటేశులు, రవి, చిన్నంపల్లి ఈరన్న, ముచ్చర్లపల్లి బొమ్మలింగ, మరో ఏడుగురికి కమిటీలో చోటు ఇచ్చారు. గోవిందు మాట్లాడుతూ వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వాల్మీకులు పిల్లల్ని బాగా చదివించుకోవాలన్నారు. వాల్మీకులు సంఘటితమై ఎస్టీ సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ మండలాల వాల్మీకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వాటర్ ప్లాంట్ ప్రారంభం

- హాజరుకానున్న మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండా(రూపానాయక్‌తాండా)లో సోమ వారం నూతన మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం, అంగన్‌వాడీ కేంద్రం భూమిపూజ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచు కొర్రా శివాజీనాయక్ తెలిపారు.ఆదివారం వారు మాట్లాడుతూ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ నిధులు రూ.3 లక్షల వ్యయంతో నూతన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయిందన్నారు. అలాగే 'నాడు–నేడు' కింద రూ.12 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవనం భూమిపూజ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్త లు, గ్రామసచివాలయ అధికారులు, వలంటీర్లు హాజరు కావాలని వారు కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతుడు ఈరన్న (ఫైల్)

కుందుర్పి: కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఈరన్న(55) ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కరిగానిపల్లికి చెందిన ఎనిమిది మంది శివమాలధారులు శ్రీశైలం వెళ్లి తిరుగు ప్రయాణంలో బోరంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. జిల్లాకేంద్రంలో చికిత్స పొందుతున్న ఈరన్న పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో ఆదివారం మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటి గంగమ్మా.. సల్లంగ చూడమ్మా





పెన్నహోబిలం సమీపంలో పెన్నానదీ తీరాన పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, విశేష అలంకరణలో ఏటి గంగమ్మ అమ్మవారు

ఉరవకొండ: మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని పెన్నహోబిలం సమీపంలోని పెన్నానది తీరాన ఏటిగంగమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పెన్నానదిలో కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఏటిగంగమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుకూర నాగరాజు, వార్డు సభ్యురాలు వనజ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లా నలమూలల నుండే కాక, కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.